క్లుప్తంగా

నేడు 'స్పందన'

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో జయ చంద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామన్నారు. సమస్యలను అర్జీల రూపంలో ఇవ్వాలన్నారు. ఆయా గ్రామ సచివాలయాల్లో కూడా అర్జీలు అందించవచ్చని తెలిపారు.

కంచికచర్ల : ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తామని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి ఆదివారం తెలిపారు. గ్రామాల్లోని సమస్యల పరిష్కారం కోసం ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని వచ్చిన అర్జీలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

ఉంగుటూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను స్పందన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు స్పందన కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు కంచికచర్లలో గడప గడపకు మన ప్రభుత్వం

కంచికచర్ల : మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-1 పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్ రావు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారన్నారు. ఆయా వార్డుల్లోని ప్రజలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు వివరించటంతో పాటు, సమస్యలు తెలుసుకుని పరిష్కారం చేస్తారన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

జుజ్జూరు(వీరులపాడు): కారు ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన సితారు వెంకట నారాయణ ఆదివారం ఇంటి నుంచి అల్లూరు వైపు ద్విచక్ర వాహనంపై తన పంట పొలానికి వెళ్తున్నాడు. అ క్రమంలో కంచికచర్ల నుంచి ఎర్రుపాలెం వైపు వస్తున్న కారు వెంకట నారాయణ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని వెంకట నారాయణను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కొండలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వేలాది సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి క్యూలైనుల్లో భక్తులు వేచి ఉన్నారు. ముందుగా పాల పొంగళ్లను వండిన మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ సురేష్ పర్యవేక్షించారు.

26న రామాలయ విగ్రహ ప్రతిష్ఠాపన

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు లైన్‌బజారులో నూతనంగా నిర్మించిన రామమందిరం నందు శ్రీహనుమత్, లక్ష్మణ, సీతా సమేత కోదండరామచంద్రస్వామి వార్ల విగ్రహ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవం ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. 25వ తేదీ బుధవారం ఉదయం 9.05 గంటలకు గోపూజ, గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశన, రక్షాబంధన, దీక్షాధారణ, అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు ప్రధాన కలశస్థాపన, మూలమంత్ర హోమం, శాంతిహోమం, 26న ఉదయం 6.36 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, విగ్రహ ప్రతిష్ఠ జరుగుతాయని తెలిపారు. అనంతరం అన్నసమారాధన జరుగుతుందన్నారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు కేంద్రీయ విద్యాలయాల్లో చిత్రలేఖనం పోటీలు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో గుంటుపల్లి, విజయవాడ కేంద్రీయ విద్యాలయాల్లో చిత్రలేఖనం పోటీలు సోమవారం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పీఎస్ఎస్ ఆర్.కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి రాసిన పుస్తకం ఆధారంగా విద్యార్థుల్లో సృజన పెంచడానికి దేశవ్యాప్తంగా 500 కేంద్రాల్లో 50వేల మంది విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులు 100 మంది పాల్గొనడానికి ఏర్పా ట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఐదుగురు విజేతలకు బహుమతులు అందిసారు.

గిడుగు రామ్మూర్తి వర్ధంతి

తిరువూరు: వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి వర్ధంతి తిరువూరు సిద్ధార్థ స్కూలులో ఆదివారం నిర్వహించారు. తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షుడు తోట ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్‌చక్రపాణి, విద్యార్థులు గిడుగు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుభాష విశిష్టతను వివరించారు.

కానిస్టేబుల్ ఉద్యోగాల పరీక్ష ప్రశాంతం

నందిగామ: డివిజన్ పరిధిలోని 17 కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభమైనప్పటికీ, గంట ముందుగానే కేంద్రాలకు రావాల్సిందిగా అధికారులు సూచించారు. దీంతో ఉదయం 7 గంటల నుంచే పరీక్ష కేంద్రాల వద్ద సందడి మొదలైంది. ఒకపక్క చలితో కూడిన మంచు కురుస్తున్నప్పటికీ అభ్యర్థులు వివిధ రవాణా మార్గాల ద్వారా పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. అభ్యర్థుల హాల్ టిక్కెట్లు పరిశీలించిన తరువాత మాత్రమే అధికారులు వారిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష కొనసాగింది. డివిజన్ పరిధిలో పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలు నిర్వహించేందుకు మొత్తం 17 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో మొత్తం 9476 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా వారిలో 7981 మంది పరీక్ష రాశారు. మొత్తం మీద 1495 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీసీపీ మేరీ ప్రశాంతి, ఏసీపీ నాగేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో హాజరైన, గైర్హాజరైన అభ్యర్థుల వివరాలు ఆరా తీయడంతో పాటు పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని స్థానిక అధికారులకు సూచనలు చేశారు. పరీక్షకు హాజరయ్యే వారు తప్పనిసరిగా గంట ముందు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయినా కూడా లేట్ గా వచ్చిన కొందరు అభ్యర్థులు పరుగులు తీస్తూ పరీక్షా కేంద్రాలకు వెళ్లడం కనిపించింది. ఇక వివిధ కారణాలవల్ల 10 గంటల తర్వాత పరీక్షా కేంద్రాలకు వచ్చిన అభ్యర్థులు వెను తిరగక తప్పలేదు. పలు పరీక్ష కేంద్రాల వద్ద ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు కంటతడి పెడుతూ అధికారులను వేడుకొంటూ కనిపించారు.

కంచికచర్ల: మండలంలో ఐదు పరీక్షా కేంద్రాల్లో పోలీస్ కానిస్టేబుళ్ల పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. కంచికచర్ల మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న పరీక్షలను డీసీపీ మేరీప్రశాంతి పర్యవేక్షించారు. ఉదయం 10 గంటలకు పరీక్షలు ప్రారంభం అయ్యాయి. 9గంటలకే అభ్యర్థులు పరీక్షా కేంద్రాల వద్ద హాజరయ్యారు. కానిస్టేబుళ్ల పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉందని నందిగామ ఏసీపీ తెలిపారు. ఐదుపరీక్షా కేంద్రాల్లో 4,072మంది పరీక్ష రాయాల్సి ఉండగా 3,504మంది హాజరుకాగా 568మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.


అభ్యర్థుల హాల్ టిక్కెట్లను పరిశీలిస్తున్న పోలీసులు


పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ పోలీసులు


కంచికచర్ల మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో అభ్యర్థులు రాస్తున్న పరీక్షలను పరిశీలిస్తున్న డీసీపీ మేరీ ప్రశాంతి


పరీక్ష రాసే అభ్యర్థుల కోసం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఏర్పాటు చేసిన బస్సులు


కానిస్టేబుల్ పరీక్షా కేంద్రాలకు బస్సులో వెళుతున్న అభ్యర్థులు

కానిస్టేబుల్ పరీక్షకు 2,227 మంది హాజరు
ఏడు కేంద్రాల్లో నిర్వహణ

జగ్గయ్యపేట: కానిస్టేబుల్ రాత పరీక్షలు ఆదివారం పట్టణంలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగాయి. కానిస్టేబుల్ ఉద్యోగ ప్రాథమిక పరీక్షల నేపథ్యంలో పట్టణంలో అధికారులు ఏడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. విశ్వభారతి, ఎస్‌జీఎస్, జేఆర్సీ, వాగ్దేవి జూనియర్, వాగ్దేవి డిగ్రీ, శ్రీ చైతన్య, మైట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలతో పాటు విజయనగరం, పలు జిల్లాల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. ప్రభుత్వం కేటాయించిన సమయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. జిరాక్స్ సెంటర్లను మూయించారు. విజయవాడ డీసీపీ మేరీ ప్రశాంతి పరీక్షా కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల్లో 2,840 మందికి గాను 2,227 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కేంద్రాల వద్ద సీఐ నాగమురళి ఆధ్వర్యంలో జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి, చిల్లకల్లు ఎస్ఐలు రామారావు, దుర్గాప్రసాద్, అభిమన్యులు బందోబస్తు నిర్వహించారు. పరీక్ష ముగిసిన అనంతరం పరీక్షా పత్రాలను ప్రత్యేక బస్సుల్లో విజయవాడ తరలించారు.

రాత పరీక్షకు వెళ్లే అభ్యర్థులకు బస్సు సౌకర్యం

నందిగామ టౌన్: పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్షకు వెళ్లే అభ్యర్థులకు కస్తాల మరియమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించినట్లు ఉచిత కోచింగ్ సెంటర్ కోఆర్డినేటర్ వాసుదేవరావు తెలిపారు. దరఖాస్తుదారులకు శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్‌లు సొంత ఖర్చుతో ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేశారని చెప్పారు. అంతే కాకుండా పరీక్ష రాసేందుకు సెంటర్‌లు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉండటంతో సొంత ఖర్చుతో బస్సులు ఏర్పాటు చేసి పరీక్షకు తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులు మాట్లాడుతూ ఉచితంగా కోచింగ్ ఇప్పించటంతో పాట బస్సులు ఏర్పాటు చేసి పరీక్షకు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల రుణం తీర్చుకోలేనిదన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన అన్ని వసతులు కల్పించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్‌కు రుణపడి ఉంటామని పలువురు తల్లిదండ్రులు పేర్కొన్నారు.

విద్యా వ్యవస్థలో సంస్కరణలతో సత్ఫలితాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: విద్యా వ్యవస్థలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంస్కరణలతో సత్ఫలితాలొస్తున్నాయని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. స్థానిక వెంకటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం యూటీఎఫ్ జిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జగన్‌మోహనరావు మాట్లాడుతూ విద్యా వ్యవస్థ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు ఉపాధ్యాయ సంఘాలు సహకరించాలని కోరారు. నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలనే సంకల్పంతోనే ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది ఎవరిని నొప్పించే మనస్తత్వం కాదని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తప్పక పరిష్కరిస్తుందని చెప్పారు. అనంతరం జగన్‌మోహనరావును యూటీఎఫ్ నాయకులు సత్కరించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సోషల్ ఆడిట్ గ్రామ సభలు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలో ఈ నెల 24 నుంచి ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ గ్రామ సభలు జరుగుతాయని ఏపీఎం సంతోష్ ఆదివారం పేర్కొన్నారు. 24న బండిపాలెం, గండ్రాయి, షేర్ మహ్మద్‌పేట, పోచంపల్లి, చిల్లకల్లు, మల్కాపురం, 27న తక్కెళ్లపాడు, బలుసుపాడు, ముక్త్యాల, 28న వేదాద్రి, 30న అనుమంచిపల్లి, 31న కెఅగ్రహారం, అన్నవరం, ధర్మవరప్పాడు తండ, గౌరవరం, రామచంద్రునిపేట, బూదవాడ, తిరుమలగిరి గ్రామాల్లో బృంధాలుగా ఆయా గ్రామ సచివాలయాల్లో సోషల్ ఆడిట్ గ్రామ సభలు జరుగుతాయన్నారు.

ఘనంగా అయ్యదేవర, మాడపాటి జయంతి

నందిగామ టౌన్: రాజకీయ నాయకులుగా, స్వాతంత్ర్య సమరయోధులుగా చరిత్రలో నిలిచిన ఎంతో మంది మహానుభావులు నందిగామ గడ్డపై జన్మించారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. పట్టణంలోని ఎస్ఎస్‌పి కాలనీ కళాకారుల సంక్షేమ భవన్ ఆవరణలో బళ్లారి రాఘవ కళా సమితి ఆధ్వర్యంలో అయ్యదేవర కాళేశ్వరరావు, మాడపాటి హనుమంతరావు జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వారి చిత్ర పటాలకు ఎమ్మెల్యే పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి శాసనసభాపతి అయ్యదేవర కాళేశ్వరరావు, హైదరాబాద్ తొలి మేయర్ మాడపాటి హనుమంతరావుల జయంతి ఉత్సవాల్లో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలకు వారు అందించిన సేవలు ఎనలేనివన్నారు. కళాకారుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. కళాకారులకు పెద్ద ఎత్తున పింఛన్‌లను అందిస్తూ వారికి అండగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. అనంతరం పలువురు దాతలు అందించిన ఆర్థిక సహకారాన్ని ఆయన కళాకారులకు అందజేశారు. కళా సమితి అధ్యక్షుడు బబ్బెళ్లపాటి గోపాలకృష్ణసాయి, పలువురు నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

మిర్చి తోటల తెగుళ్లకు నివారణ చర్యలు

నందిగామ: వాతావరణ పరిస్థితుల కారణంగా మిర్చి తోటలకు ఈ ఏడాది తెగుళ్లు అధికంగా వ్యాపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు పంటలపై మోతాదుకు మించి క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. దీని కారణంగా పెట్టుబడి అధికమవడంతో పాటు దిగుబడి కూడా తగ్గిపోతుంది. ముఖ్యంగా నల్ల నల్లి నివారణకు అధిక మోతాదులో మందులు పిచికారీ చేయడం వలన తాలు మిరపకాయలు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇక ఎక్కువ శాతం మంది రైతులు అధికారుల సూచనలు పాటిస్తూ అవసరమైన మోతాదులో మందులు పిచికారీ చేసు కుంటున్నారు. ముఖ్యంగా నల్ల నల్లి నివారణకు పంట పొలాల్లో బ్లూ రంగు కల అట్టలను ఏర్పాటు చేస్తు న్నారు. తెల్ల దోమ నివారణకు పసుపు రంగు అట్టలను అమర్చారు. ఆ అట్టల రంగుకు సంబంధిత క్రిమి కీటకాలు ఆకర్షితమవుతాయని చెబుతున్నారు. దీంతో తక్కువ ఖర్చుతో రైతులు మిరప తోటలలో బ్లూ, ఎల్లో రంగులు గల అట్టలను ఏర్పాటు చేస్తున్నారు.


మిరప తోటలో ఏర్పాటుచేసిన పసుపు రంగు అట్ట

కనుల పండువగా దీక్షా స్వాముల భజన


భజన కార్యక్రమంలో దీక్షాస్వాములు

పెనుగంచిప్రోలు: అమ్మయే శరణం తిరుపతమ్మ... స్వామియే శరణం గోపయ్య అంటూ గ్రామంలో ఆదివారం రాత్రి శ్రీతిరుపతమ్మ అమ్మవారి దీక్షా స్వాముల భజనా కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. అమ్మవారి రంగుల మండపంలో అమ్మవారు, స్వామి వార్ల ప్రతిమలను ఏర్పాటు చేశారు. ముందుగా పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు మర్రెబోయిన వెంకటరమణ నేతృత్వంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన కళాకారులు పాడిన పాటలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. గ్రామంలోని దీక్షా స్వాముల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భజన కార్యక్రమంలో దీక్షా స్వాములు, మహిళలు పాల్గొన్నారు.

బీసీలకు వెన్నుదన్నుగా నిలిచిన ఏకైక సీఎం జగన్

పూసల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చేని కుమారి

పెనుగంచిప్రోలు: బీసీలను గుర్తించి వారికి వెన్నుదన్నుగా ఉన్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని పూసల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చేని కుమారి తెలిపారు. 56 బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవీకాలం పొడిగించిన సందర్భంగా ఆదివారం స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటికి చైర్మన్లు, డైరెక్టర్లను నియమించి సమోన్నత న్యాయం చేసిన ముఖ్యమంత్రి జగనన్న అన్నారు. బీసీలు ఎప్పుడూ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి అండగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు చేని రాంబాబు, ఏలూరి శ్రీనివాసరావు, వెంకటేష్, లీల, గంగరాజు, సైదులు, కొలిపాక రాము పాల్గొన్నారు.


సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కుమారి

అంబేడ్కర్, జ్యోతిరావ్‌పూలేకు నివాళులు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహాలకు ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ బి.శ్రీధర్ ఆదివారం నివాళులర్పించారు. ఈనెల 9వ తేదీన విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పూలే విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాల్సిన ఎండీ శ్రీధర్ అనివార్య కారణాలతో ఆ రోజు హాజరు కాలేదు.

ఎన్టీటీపీఎస్ సందర్శనకు వచ్చిన ఆయన పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఏపీ జెన్‌కో థర్మల్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రాజు, సీఈ అశోక్ కుమార్‌రెడ్డి, సీఈ (కమర్షియల్) పద్మసుజాత, యూనియన్ నేతలు ఉమావిజయ్‌చంద్, కల్యాణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ మహాసభ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పీఎఫ్-95 పెన్షనర్లకు కనీసం రూ.9 వేలు పింఛన్ ఇవ్వాలని ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఏ శాస్త్రి అన్నారు. కొండపల్లి క్రాంతి హైస్కూల్లో ఆదివారం ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రథమ మహాసభ జరిగింది. కేంద్ర ప్రభుత్వం ఈపీఎఫ్ పెన్షన్ రూ.9వేలు ఇవ్వడానికి పార్లమెంటులో చట్టం చేయాలని కోరారు. సంఘ జిల్లా అధ్యక్షుడు జీవరత్నం, ప్రభుదాస్, జమలయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణం వద్దు

నూజివీడు: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వారి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని నూజివీడు ట్రాఫిక్ ఎస్సై శాగం రాధాకృష్ణారెడ్డి అన్నారు. 34వ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం ఆటోడ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను పాటించి ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. మద్యం సేవించి నడపడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, ఆటోల్లో లౌడ్ స్పీకర్లు పెట్టడం, డ్రైవర్‌కు రెండువైపులా ప్రయాణికులను కూర్చోబెట్టడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరికీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, యూనిఫాం ధరించాలని స్పష్టం చేశారు. ఆటోలను రోడ్లపై అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసి ట్రాఫిక్ ఇబ్బందులు సృష్టిస్తే ఊరుకోబోమని, నిర్ణీత ప్రదేశంలో క్రమపద్ధతిలో ఆటోలను పార్కింగ్ చేసుకోవాలని చెప్పారు. వన్‌వేలను అతిక్రమిస్తే జరిమానా విధిస్తామని, వెనుక నుంచి ఏవైనా వాహనాలు వస్తున్నాయనే విషయాన్ని చూడకుండానే ఆటోలను యూటర్న్ తీసుకుంటున్నారని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ సిబ్బంది, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.


ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై రాధాకృష్ణారెడ్డి

ఆయుష్మాన్ భారత్ సర్వే పరిశీలన

ముసునూరు: ఆయుష్మాన్ భారత్ సర్వేను తక్షణమే పూర్తి చేయాలని ఎంపీడీఓ జి.రాణి ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వలంటీర్లు నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాలను ఆదివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సర్వే తీరుపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చీలి లక్ష్మి అర్లప్ప, ఈఓపీఆర్డీ అచ్యుత సత్యనారాయణ, కార్యాలయ పర్యవేక్షకుడు సాయి రాము, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.


ముసునూరులో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతుల ప్రదానం

విజయవాడరూరల్: కొత్తూరు తాడేపల్లి గ్రామానికి చెందిన ఈవీఈ ఫ్రెండ్స్ సర్కిల్ చైర్మన్, ఇంజినీర్ ఈడా వేదాద్రి, ఎం.శ్రీనివాసరావు జంట క్రెడాయ్ ఏపీ బ్యాడ్మింటన్ డబుల్స్ విజేతలుగా నిలిచారు. విజయవాడలో శుక్ర, శనివారం రెండు రోజులు రాష్ట్రంలోని బిల్డర్స్ కు క్రెడాయ్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. టోర్నమెంట్ లో సుమారు 32 జట్లు పాల్గొనగా వేదాద్రి, శ్రీనివాసరావు జట్టు విజయం సాధించింది. వరుణ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ ప్రభు కిషోర్ విజేతలకు శనివారం రాత్రి బహుమతులు అందజేశారు.


క్రెడాయ్ పోటీల్లో బహుమతి అందుకుంటున్న ఈడా వేదాద్రి

అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. సెలవు దినంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లతో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి రావటంతో గ్రామంలో ట్రాఫిక్ అవరోధాలు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కడుపుబ్బా నవ్వించిన నాటికలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి నాగార్జున కళాపరిషత్ ఆధ్వర్యంలో సుంకర-టి కృష్ణ మెమోరియల్ 15వ ఆహ్వాన నాటిక ప్రదర్శనలు హాస్య భరితంగా సాగుతున్నాయి.శనివారం రాత్రి హైదరాబాద్ కళాంజలి వారు 'మనిషి మంచోడే' నాటికతో ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించారు.